RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

సోమవారం 2 సెప్టెంబర్ 2024

quicktodaynews.com






# కాళేశ్వరం ఎత్తిపోతలే శరణ్యం

## నీరు సముద్రంలో కలవకుండా చూడాలి

**నిజామాబాద్, సెప్టెంబర్ 1 (క్విక్ టుడే న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం పంతానికి పోయి రైతులకు అన్యాయం చేయొద్దని మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి హితవు పలికారు. నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఎల్లంపల్లి ద్వారా నీళ్లు ఎత్తిపోసి వెంటనే మిడ్‌మానేరు, ఎల్ఎండీ జలాశయాలను నింపాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని మండిపడ్డారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రైతుల సాగునీటి కష్టాలు తీరిస్తే.. ఆయనపై కోపంతో రేవంత్ సర్కారు రైతుల నోట్లో మట్టికొడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం మోటర్లను ఆన్‌చేసి ఎత్తిపోతలు ప్రారంభిస్తే రైతులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటారనే అక్కసుతోనే కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరం నీటిని సముద్రంపాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద లక్ష 75 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నదని, అయినా సర్కారుకు సోయిలేదన్నారు. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీళ్లు ఎత్తిపోయవచ్చని నీటిపారుదలశాఖ అధికారులే చెబుతున్నారని వెల్లడించారు. వర్షాలు లేక పోవడంతో ఎల్ఎండీ రిజర్వాయర్ ఇప్పటికీ నిండలేదని, ఎల్లంపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, ఎల్ఎండీ జలశాయాలను నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాకతీయ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తే కుంటలు, చెరువులు నిండి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. తమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెడితేనే కాళేశ్వరం ప్రాజెక్ట్ రీ డిజైన్ చేసి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద నిత్యం నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది కాబట్టే ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకే అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం రీ డిజైన్‌పై రాద్ధాంతం చేయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.నవంబర్ నెలలో పంటలకు నీళ్లు ఎక్కువగా అవసరం ఉంటాయని, వెంటనే ఎత్తిపోతలు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# అత్యాచారాలకు ఉరిశిక్షే సరి?



**హైదరాబాద్, సెప్టెంబర్1 (క్విక్ టుడే న్యూస్) :** అత్యాచారాలకు ఉరిశిక్షే సరైనదన్న అభిప్రాయం ఇప్పుడు సర్వత్రా వినిపిస్తోంది. మహిళల దగ్గర నుంచి పాలకుల వరకు ఇదే చెబుతున్నారు. అలాగే మమతా బెనర్జీ కూడా ఇదే విషయాన్ని ముందుంచారు. నిజంగానే ఉరిశి విధించాల్సిందే. మనదేశంలో స్త్రీని గౌరవంగా చూసుకునే ఆచారం నుంచి ఇప్పుడు అత్యాచారం వైపుకు వెళుతున్నాం. నిజంగానే మన చట్టాలను కఠినతరం చేసుకోవాల్సి ఉందని వరుస ఘటనలు మనలను హెచ్చరిస్తున్నాయి. అత్యాచారాలకు పాల్పడినవారిని వారంలోగా బహిరంగంగా ఉరితీయాలి. అప్పుడే మృగాళ్లకు భయం పుడుతుంది. అత్యాచారం చేయాలంటేనే వణికి పోయేలాగా మన చట్టాలను కఠినం చేసుకోవాల్సిన అసవరాన్ని తాజాగా కోల్‌కతా ఘటన చెబుతోంది. కొంతమంది గ్యాంగుగా అభయను చెరిచి హత్య చేశారు. అందులో ఓ మహిళా స్నేహితురాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అత్యాచారం చేసిన వారికి ఆమె సహకరించినట్లు సోషల్ మీడియా కోడై కూస్తోంది. కానీ ఒక వ్యక్తిని బలిచేసి అతడి చుట్టూ నాటకాన్ని తిప్పుతున్నారు. ఇంతగా అధికార యంత్రాంగం ఉన్న మనదేశంలో అక్కడ ఏం జరిగిందో గుర్తించి ఇంకా శిక్షించలేక పోతున్నాం. ఉరిశిక్ష వేయాలంటున్న మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నా...ఏమీ చేయలేకపోతున్నారు. శారీరకంగా పురుషుడి కంటే బలహీనురాలైన స్త్రీని మృగాళ్లు వెన్నాడుతున్నా..ఇంకా చూస్తూ కూర్చోవడం సరికాదు. నీతి వాక్యాలు పలుకుతున్న పాలకులు వెంటనే తగిన చొరవ తీసుకోవాలి. కోత్‌కతాతో ఇక గుణపాఠం కావాలి. దేశానికి ఒక సందేశం వెళ్లాలి. అత్యాచారం అంటే జడుసుకునేలా..ప్రాణాలు వదులు కోవాల్సిందే అన్న రీతిలో కఠిన శిక్షలు పడాలి. లింగ సమానత్వం గురించి మాట్లాడుతున్న వారు మృగాళ్ల గురించి మాట్లాడాలి. ఏ నేరానికైనా ముఖ్యంగా స్త్రీల మీద, బలహీనవర్గాల మీద జరిగే అకృత్యాలకు శిక్షలు చాలా కఠినంగా ఉండాలి. చిన్న, పెద్ద ఏ నేరాలైనా భయపెట్టే శిక్షలు, వాటి అమలు సరిగ్గా ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుంది. ఎలాంటి కేసులో అయినా ఒకక్క నేరస్థుడు కూడా తప్పించుకోలేడన్నట్లుగా చట్టాలు, న్యాయవ్యవస్త ఉండాలి. నేరస్థులకు ఉరిశిక్షలు అమానవీయం అని చెప్పేవాళ్లను బహిష్కరించాలి. అలా అయితే మరి అమాయకులను చంపడం అమానవీయం కాదా అన్నది చర్చించాలి. 30 ఏండ్ల కిందట గుంటూరు దగ్గర దుండగులు బస్సుకు నిప్పు పెట్టిన సంఘటనలో 27 మంది సజీవ దహనమయ్యారు. ఆ దుండగుల న్యాయవాది వారిని ఉరి తీయకూడదని వాదించాడు. న్యాయానికే వారికి శిక్ష వేసే హక్కు లేనప్పుడు, పక్కవారిని చంపే హక్కు సామాన్యులకు ఉందా? బతికే హక్కు దుండగులకే ఉంటే మరి ఆ 27 మందికి బతికే హక్కు లేదా? ఇటువంటి వెర్రివాదనలు పక్కనపెట్టి శిక్ష రుజువైన ప్రతివారికి ముఖ్యంగా అత్యాచారం, హత్య వంటి సందర్భాలలో ఉరిశిక్షనే ఖరారు చేయాలి. ఒకసారి ఉరిశిక్ష పడ్డాక అతడిపై మళ్లీమళ్లీ విచారణ జరపకుండా చూడాలి. ఇటువంటి నేరస్థులు ఎంతమందయినా వెరవాల్సిన పనిలేదు. ముఖ్యంగా నేరచిత్ర ఉన్నటువంటి రాజకీయవేత్తలను, నేరచరిత్ర ఉన్న రాజకీయ నాయకులను కూడా ఉరితీయాల్సిందే. అలాంటి వారు పాలకులు అయితే శిక్షలు పడొద్దని కోరుకుంటారు. కలకత్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ వారు గురివింద గింజల్లా ప్రవర్తిస్తున్నారు. నిందితులెవరైనా కఠిన శిక్షలుంటేనే న్యాయం, ధర్మం పాటింపబడతాయని గ్రహించాలి. మానవత్వం కంటే, శిక్షలే ముఖ్యమని గుర్తించాలి. కసబ్ లాంటి వాడిని మేపి, ఏళ్లు కాలం గడిపి ఘనంగా మన న్యాయవ్యవస్త ఉందని చాటుకోవాల్సిన పనిలేదు. వెంటనే ఖతం చేయడమే శిక్షగా చూడాలి. దేశంలో మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాల కేసుల్లో కేవలం 30 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయంటే మన నేర ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో గమనించాలి. అత్యాచారాలు చేసిన 72 శాతం నిందితులు నేర వ్యవస్థలో డొల్లతనాన్ని అసరాగా చేసుకొని నిర్దోషులుగా బయటపడు తున్నారు. ఈ నేపథ్యంలోనే కోల్‌కతా రేప్ కేసును చేపట్టడంలో మొదటి నుంచి జరిగిన తప్పులు ఆ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆందోళనలకు దారి తీస్తోంది. అత్యాచార నిందితులకు సకాలంలో శిక్షలు పడకపోవడం వల్లనే కోల్‌కతా ఘటన జరిగిన వెంటనే దేశం యావత్తూ ఆందోళనకు దిగింది. చివరకు మమతాబెనర్జీ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు దారి తీస్తున్నాయి. అలాగే ఏటా 30,000 కు పైగా అత్యాచారాలు జరుగుతున్నట్లు గణాంకాలు చూస్తుంటే ఆందోళన కలిగించే విషయమే కాకుండా, నేర న్యాయవ్యవస్థలోని పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్లుఈ నాలుగు విభాగాల పనితీరు లోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తోంది. దేశంలో ప్రతి పది నిమిషాలకు ఒక బాలికపై అత్యాచారం జరిగిందని తెలుసుకోవచ్చు. ఇన్ని జరుగుతున్నా నేరవ్యవస్థలోని నాలుగు విభాగాలు పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్ల త మ విధుల్లో సామూహిక వైఫల్యం చెందితే నేరస్థుల హృదయాల్లో శిక్ష అంటే ఏమాత్రం భయం ఉండడం లేదు. దర్యాప్తు ప్రారంభదశలో నేరం నమోదు ఆలస్యమైతే తప్పు చేసినట్టే. కోల్‌కతా వైద్య విద్యార్థిని కేసులో ఎఫ్ఐఆర్ నమోదు 14 గంటలు ఆలస్యమైంది. అంతేకాకుండా క్రైమ్‌సీన్‌ను రక్షించ కుండా ధ్వంసం చేశారు. దీంతో అనేక అనుమానాలు పెరిగి దర్యాప్తునే శంకించ వలసిన పరిస్థితి ఏర్పడింది. బద్లాపూర్ కేసులో కూడా ప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్న తరువాత పోలీస్‌లు దర్యాప్తుకు రంగంలో దిగారు. ఎఫ్ఐఆర్ నమోదులో వాంగ్మూలాలు రికార్డు చేయడంలో విపరీతమైన జాప్యం చేయడంపై బొంబాయి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. శిక్ష అమలులో విపరీతమైన జాప్యం చేస్తే బాధితులకు సకాలంలో న్యాయం అందించలేని వారవుతారు. అందుకే అత్యాచార కేసుల్లో ముందుగా కఠిన శిక్షలకు పూనుకోవాలి. వారం పదిరోజుల్లోగా కేసులను తేల్చేసి దోషులను బహిరంగంగా ఉరితీయాలి. అత్యాచార నిందితుడి ఆస్తులు లాగేసుకోవాలి. ఇలా కఠన శిక్షలు అమలు జరిగితే తప్ప దేశంలో ఇలాంటి అరచాకాలను అడ్డుకోలేం.

# రాజకీయాల్లో జంపింగ్ జపాంగ్

## అధికారం ఉన్నచోటుకే నేతల పరుగు

## వైకాపాది కూడా అదే పరిస్థితి



**అమరావతి, సెప్టెంబర్ 1 (క్విక్ టుడే న్యూస్) :** రాజకీయం పాదరసం లాంటి. గతంలో పార్టీల్లో రాజకీయ విలువలు ఉండేవి. ఇప్పుడంతా అధికారం చుట్టూ రాజకీయ నడుస్తోంది. అధికార పార్టీలోకి వెళ్లడం ఫ్యాషన్‌గా మారింది. కాబట్టి పార్టీలు మారడాన్ని పెద్దగా తప్పు పట్టాల్సిన పనిలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలోకి చేరికలను ఇలాగే చూడాలి. తెలంగాణలో కొందరు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు చేరుతారని ప్రచారం సాగుతోంది. అలాగే ఎపిలో వైసిపి నుంచి అధికార టిడిపిలోకి వలసలు మొదలయ్యాయి. వీటి గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు జంపింగ్‌ల సీజన్ నడుస్తోంది. నిన్నామొన్నటి వరకూ తిరుగులేని పార్టీగా ఉన్న వైఎస్‌ఆర్‌సీపీ నుంచి రోజుకు ఇద్దరు ముఖ్యనేతలు చొప్పున రాజీనామాలు చేస్తున్నారు. గురువారం ఇద్దరు ఎంపీలు రాజీనామా చేయగా.. శుక్రవారం ఇద్దరు ఎమ్మెల్సీలు ఆ పని చేశారు. తర్వాత ఎవరు అన్నదానిపై అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ అధ్యక్షుడు జగన్ కోర్టు అనుమతి తీసుకుని విదేశీ పర్యటనకు వెళు తున్నారు. లండన్ లో ఉంటున్న కుమార్తె పుట్టిన రోజు వేడుకల కోసం వెళ్తానని ఆయన కోర్టుకు పెట్టుకున్న దరఖాస్తుకు ఆమోదం లభించింది. సెప్టెంబర్ రెండో తేదీన వైఎస్ వర్థంతి సందర్భంగా ఇడుపులపాయలో నివాళులు అర్పించి లండన్ కు బయలుదేరుతారు. మళ్లీ నెలాఖరులో వస్తారు. ఇప్పుడు వలసలు పెరుగుతున్న సమయంలో జగన్ అందుబాటులో లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందన్న సందేహం ఆ పార్టీ క్యాడర్ లో వినిపిస్తోంది. ఏపీకి రాజ్యసభలో మొత్తం పదకొండు మంది సభ్యులు ఉన్నారు. ఆ పదకొండు మంది వైసీపీకి చెందినవారే. టీడీపీకి ఒక్కరు కూడా లేరు. అయితే ఆ పదకొండు మందిలో గురువారం ఇద్దరు రాజీనామా చేశారు. వారి స్థానాలు ఖాళీ అయినట్లుగా గెజిట్ కూడా విడుదల అయింది. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఆ రెండు స్థానాలు కూటమి ఖాతాలో పడిపోతాయి. ఇంకా వైసీపీకి మిగిలిన తొమ్మిది మంది ఎంపీల్లో ఎంత మంది ఉంటారో ఎంత మంది ఉండరో అర్థం కాని పరిస్థితి .

ఏపీ శాసనమండలిలో వైసీపీకే మెజార్టీ ఉంది. మొత్తం 58 మంది సభ్యుల్లో 36 మంది ఆ పార్టీకి చెందిన వారు అధికారికంగా ఉన్నారు. కానీ రాజీనామాలు.. అనర్హతలతో ఇప్పటికీ ఆ సంఖ్య 28కి తగ్గిపోయింది. రెండు రోజుల్లో ముగ్గురు రాజీనామా చేశారు. అలాగే పలువురు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేయలేదు కానీ.. టీడీపీ హైకమాండ్ తో టచ్ లో ఉన్నారు. గతంలో వైసీపీ ఆదేశాలు పట్టించుకోకుండా సభకు హాజరు కావడం.. వైసీపీ సమావేశాలకు వెళ్లక పోవడం వంటి వాటి ద్వారా తాము ఎవరి వైపో చెప్పారు. అసెంబ్లీలో వైసీపీ ఆధిక్యతను తగ్గించడానికి టీడీపీ ఖచ్చితంగా ప్రయత్నిస్తుంది. జగన్ దేశంలో లేని సమయంలో ఇది మరంత ఉద్ధృతంగా సాగుతుందిని భావిస్తున్నారు. దీనికి విరుగుడుగా వైసీపీ వద్ద ఏదైనా వ్యూహం ఏదైనా ఉందా అని ఆ పార్టీ నేతలు మథనపడుతున్నారు. రాజకీయాల్లో విశ్వాసపాత్రులు అనే వారు ఎవరూ ఉండరు. అవకాశాలను బట్టే ఎవరి వ్యవహారశైలి అయినా ఉంటుంది. గతంలో ఇలాంటి ప్రమాదం ఉంటుందని అంచనా వేసి జగన్ .. ఓ ప్లీనరీలో.. తనను శాశ్వత అధ్యక్షునిగా ప్రకటించుకున్నారు. కానీ అది చెల్లదని ఈసీ ప్రకటించింది. బహుశా ఇప్పుడు అలాంటి పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందని అప్పుడే ఊహించారేమోనన్న సందేహం రాజకీయవర్గాలకు వస్తోంది. కారణం ఏదైనా రాబోయే రోజుల్లో జగన్ మోహన్ రెడ్డి చాలా కఠినమైన పరిస్థితుల్ని ఎదుర్కోబోతున్నారు. పాత కేసుల విచారణ.. ముంచుకొచ్చే కొత్త కేసులు.. రాజకీయపరమైన సవాళ్లతో ఆయన ఉక్కిరిబిక్కిరి కాబోతున్నారు.



# ఆందోళన కలిగిస్తున్న ఎంపాక్స్

## పాశ్చాత్య దేశాల్లో పెరుగుతున్న కేసులు

## అప్రమత్తం అయిన భారత ప్రభుత్వం

**న్యూఢిల్లీ, ఆగస్ట30:** కరోనా పీడ వదిలిందనుకుంటే ఏదో ఒక మాయదారి రోగం దాపురిస్తోంది. తాజాగా ఇప్పుడు మంకీ పాక్స్ భయం పుట్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఎంపాక్స్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో ఆరోగ్య నిపుణులు సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంపాక్స్ విజృంభణ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ రెండోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ఆ తర్వాత ఎంపాక్స్ కొత్త స్ట్రెయిన్, క్లాడ్ ఐబీ గుర్తించారు. ఇదే కేసుల పెరుగుదలకు దారితీసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మధ్య, పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో జూనోటిక్ వైరల్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కాంగో దేశంలో ఎంపాక్స్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ సోకిన వారి సంఖ్య ఇటీవల భారీగా పెరిగింది. కాంగో ఆరోగ్యశాఖ మంత్రి రోజర్ కంబా ప్రకటన ప్రకారం.. ఇప్పటి వరకు 18వేల మందికిపైగా కేసులు రికార్డయ్యాయి. ఇందులో కనీసం 610 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. విస్తరిస్తున్న వైరస్ మధ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వైరస్ ప్రధానంగా లైంగిక సంబంధాలు, వైరస్ సోకిన వ్యక్తులకు దగ్గరగా ఉండడం, రోగులు వాడిన దుస్తులు వాడడం వల్ల వైరస్ సోకుతుందని నిపుణులు సూచించారు. కాంగోతో సహా అనేక దేశాల్లో కొత్త ఎంపాక్స్ స్ట్రెయిన్‌పై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు వైరస్ ఊహించినదానికంటే చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందని, రూపంలోనూ మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, వైరస్‌ను సరిగ్గా ట్రాక్ చేసేందుకు అనువైన సౌకర్యాలు లేకపోవడం, వైరస్ తీవ్రత, వ్యాప్తి చెందుతున్న మార్గాలు వంటి ఎన్నో తెలయని విషయాలు ఉన్నాయని.. వీటన్నింటిపై మరోసారం అధ్యయనం నిర్వహించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నైజీరియాలోని డెల్టా యూనివర్సిటీ హాస్పిటల్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజ్ స్పెషలిస్ట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ఎమ్జంగ్÷న్సీ కమిటీ చైర్మన్ డాక్టర్ డిమి ఒగోయినా మాట్లాడుతూ ఆఫ్రికాలో ఎంపాక్స్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. వైరస్ వ్యాప్తి పెరుగుతోందన్న ఆయన.. వైరస్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేదన్నారు. వైరస్ పరివర్తన, కొత్త స్ట్రెయిన్‌లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు అమెరికా, స్వీడన్, థాయ్‌లాండ్‌లో అనేక కేసులు పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఎంపాక్స్ ముప్పు నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టింది. అనుమానిత కేసులను గుర్తిస్తే చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసింది. ఎంపాక్స్ కేసులను గుర్తించేందుకు, సరైన చికిత్స అందించేందుకు ఆరోగ్య నిపుణులకు కేంద్రం శిక్షణ కార్యక్రమాలను సైతం ప్రారంభించింది. అయితే, భారత్‌లో ఇప్పటి వరకు కేసులు నమోదు కాకపోవడం ఊరటనిచ్చే విషయం

RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
QUICK TODAY
సోమవారం 2 సెప్టెంబర్ 2024
quicktodaynews.com





# గెలిస్తే మహిళలకు ఐవీఎఫ్ చికిత్స ఉచితం

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ హామీ

**వాషింగ్టన్, సెప్టెంబర్ 1:** రెండోసారి అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాను గెలిస్తే మహిళలకు ఉచిత ఐవీఎఫ్ చికిత్సను అందించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. దీన్ని ఎలా అమలు చేయనున్నారు? నిధులను ఎలా సమకూరుస్తారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. 'ట్రంప్ పాలనలో ఈ చికిత్సకు సంబంధించిన అన్ని ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. లేదా మీ బీమా కంపెనీ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది' అని మిషిగన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకటించారు. ఈ చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకొన్నది. అమెరికాలో ఒక దఫాకు పదివేల డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ చికిత్స ఫలవంతమయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నందున పలు దఫాల్లో తీసుకోవాల్సి రావొచ్చు. 1973లో రో వర్సెస్ వేడ్ కేసులో అనివార్య పరిస్థితుల్లో గర్భవిచ్ఛిత్తి చేయించుకునే హక్కు మహిళలకు ఉందని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అదే అత్యున్నత న్యాయస్థానం ఆ తీర్పును కొట్టివేస్తూ గత ఏడాది మరో తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో గర్భవిచ్ఛిత్తి విధానంపై ట్రంప్ కొంతకాలంగా భిన్నస్వరాలు వినిపించారు. చివరకు ఈ అంశాన్ని రాష్ట్రాలకు వదిలేయాలని ప్రతిపాదించారు. దీంతో ఈ విషయంపై

ట్రంప్‌ను ఉద్దేశించి డెమోక్రాట్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తరుణంలో తాజా ప్రకటన రావడం గమనార్హం. సంతానలేమితో బాధపడుతున్న ఎంతోమందిని కృత్రిమ గర్భధారణ పద్ధతులు ఆదుకుంటున్నాయి. సంతాన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి. వీటిల్లో ఎక్కువగా వాడకంలో ఉన్నది ఐవీఎఫ్ పద్ధతే. ప్రయోగశాలలో అండాన్ని, శుక్రకణాలను ఫలదీకరణ చెందించి, అభివృద్ధి చెందిన పిండాన్ని మహిళల గర్భసంచిలో ప్రవేశపెట్టటం దీనిలోని కీలకాంశం. దీంట్లో వెంటనే గర్భం వస్తుందని, సంతానం కలుగుతుందని చాలామంది భావిస్తుంటారు. నిజానికి అందరికీ తొలిసారే సంతానం కలగకపోవచ్చు. రెండు మూడు సార్లు ప్రయత్నించాల్సి రావొచ్చు. కొందరికి సఫలం కాకపోవచ్చు కూడా. అందుకే ఈ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇకపోతే డెమోక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్.. సీఎన్ఎన్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూపై రిపబ్లికన్ నేత డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. కమలా హ్యారిస్ ఇంటర్వ్యూ బోరింగ్‌గా ఉన్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. మీడియా వేసిన ప్రశ్నలకు ఆమె సరైన సమాధానాలు ఇవ్వలేదన్నారు. సోషల్ మీడియా ట్రుత్ ద్వారా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హ్యారిస్ విలువల మారలేదన్నారు. కమలా ఇచ్చిన వాగ్దానాలతో అమెరికా వేస్ట్‌ల్యాండ్‌గా మారుతుందని ఆయన ఆరోపించారు. కమలా హ్యారిస్‌తో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. మిచిగన్‌లో జరిగిన సభలోనూ ట్రంప్ మాట్లాడారు. హ్యారిస్‌ది ఫ్లాప్ షో అని విమర్శించారు.

# ఉద్యోగులకు లేని పెన్షన్.. పాలకులకు ఎందుకు?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** మోడీ పదేళ్లుగా ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు కలిగింది అని చెప్పడానికి దాఖలాలు లేవు. ప్రధానంగా మధ్య తరగతి ప్రజలను దారుణంగా పీల్చి పిప్పి చేస్తున్నారు. రకరకాల పన్నులు, జిఎస్టీలతో వారి ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారు. దీనిపై చర్చించడానికి వేదిక లేకుండా పోయింది. జిఎస్టీ బాదుడంతా కేవలం పెద్దల కోసమే తప్ప... సామాన్యులకు కాదని బొంకుతున్నారు. అద్భుతమైన, అందమైన మాటలతో గత పదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నా..చర్చించేవారు లేకుండా పోయారు. ఈ క్రమంలో ఉద్యోగులకు పెన్షన్ స్కీమ్ అన్నది ఎండమావలాగా మారింది. జీవితాంతం ప్రభుత్వ ఉద్యోగులుగా చేసి, రిటైర్‌మెంట్ అయిన వారికి పెన్షన్ ఉండదు. కానీ రాజకీయ నాయకులకు మాత్రం లక్షల్లో జీతాలు పెన్షన్లు అందుతున్నాయి. కేంద్రంలో ఎంపిలకు లక్షల్లో జీతాలు..పెన్షన్లు ఉన్నాయి. రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో కూడా అదే విధంగా జీతాలు పెన్షన్లు ఉన్నాయి. వారు మాత్రం చట్టాలు చేసుకుని వేలకోట్ల ప్రజాధనం తమ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. లక్షల కోట్ల పన్నులు వసూళ్లు అవుతున్నా..ప్రజల అవసరాలు గుర్తించి ఖర్చు చేయడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు లక్షల్లో జీతాలు, పెన్షన్లు అవసరా అన్నది గుర్తించడం లేదు. ప్రజలే ఈ విషయంలో నిలదీయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగులకు లేని పెన్షన్లు రాజకీయ నేతలకు అవసరామ అన్నది చర్చించాలి. ఉద్యోగులు కానివారికి పెన్షన్లు ఇవ్వడం అనుచితంగా గుర్తించాలి. రాజకీయమంటే కేవంల ప్రజలకు సేవ చేయడం తప్ప మరోటి కాదు. ఈ విషయంలో దేశంలో మేధావులు చర్చించాలి. ప్రజలు కూడా ఆలోచించాలి. ఇకపోతే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సిపిఎస్ అనేది నాటి వాజ్‌పేయి సర్కారు హయాంలో పురుడు పోసుకుంది. ఇప్పుడు ప్రజల పట్ల ప్రేమ ఒలకబోస్తున్న కాంగ్రెస్ దానని అమలు చేసింది. నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో అమల్లోకొచ్చింది. సైనిక రంగ ఉద్యోగులు మినహా 2004 ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన వారిని కేంద్రం ఎన్‌పిఎస్‌లోకి చేర్చింది. అప్పటి నుంచి ఉద్యోగులు ఒపిఎస్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మధ్యనే రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఒపిఎస్‌కు వెళ్లాయి. దాంతో కేంద్రంతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాలు రాజకీయంగా ఇబ్బందుల్లో పడ్డాయి. కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి సోమనాథన్ నేతృత్వంలో గతేడాది మోడీ సర్కారు కమిటీ వేయగా, అది యుపిఎస్‌ను సిఫారసు చేసింది. ఆ నివేదికకు మోడీ సర్కారు పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న వైసిపి ప్రభుత్వం మాట తప్పి జిపిఎస్ పేరిట విన్యాసాలు చేసింది. అందుకే మొన్నటి ఎన్నికల్లో సిపిఎస్ రద్దు ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. దీంతో వైకాపా ప్రభుత్వం మాట తప్పినందుకు మూల్యం చెల్లించు కుంది. టిడిపి ప్రభుత్వం సైతం సిపిఎస్ రద్దు అనకుండా ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పెన్షన్ స్కీం తెస్తామంది. కేంద్రం ప్రతిపాదించిన యుపిఎస్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం మౌనం దాల్చింది. ఇదీ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో, పాలనలో జీవితాంతం సేవ చేసే ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి. వారిని బానిసలుగా





చూస్తూ..వెట్టి చేయించుకుని ముష్టి విదిల్చి పంపాలన్న ఎత్తగడగానే పాలన సాగుతోంది. ఉద్యోగ నియామకలు ఎలాగూ లేవు. ఉన్న ఉద్యోగుకలు కాస్తా పెనషన్ ఎత్తేసి రెండు దశాబ్దాలు అవుతున్నా పట్టించుకోవడం లేదు. సిపిఎస్, రిక్రూట్‌మెంట్ నిలిపివేత, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ అనేవి ప్రపంచబ్యాంక్ ఆదేశిత, నయా ఉదారవాద విధానాలు. వాటి అడుగు జాడల్లో నడిచే ప్రభుత్వాలకు ఆ విధానాలే శిలాశాసనాలు. ఉద్యోగులకు పెన్షన్ అనేది భిక్ష కాదు, హక్కుగా గుర్తించాలి. ఐదేళ్లు పాలించే వారికే పెన్షన్ ఉంటే 30 ఏళ్లపాటు ఉద్యోగాలు చేస్తున్నవారికి తప్పకుండా పెన్షన్ ఉండాల్సిందే. ఈ తత్వాన్ని పాలకులు అంగీకరించి తీరాలి. ప్రభుత్వాల మెడలు వంచేందుకు ఉద్యోగులు సమైక్యంగా ఉద్యమించాలి. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రస్తుతం ఉన్న నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పిఎస్) స్థానంలో యూన్గి÷డ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)ను తెస్తూ నరేంద్ర మోడీ కేబినెట్ ఇటీవల తీసుకున్న నిర్ణయం మరో ఎన్నికల జిమ్మిక్కు కాక మరోటి కాదు. ఎందుకంటే మోడీ ఏ పనిచేసినా నిజాయితీ ఉండడం లేదని గుర్తించాలి. ఈ ఏడాదిలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోల గట్టెక్కేందుకు ఉద్యోగులకు వేస్తున్న ఎరగా గుర్తించాలి. హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడగా మహారాష్ట్ర ఎన్నికలూ ఇప్పుడే ఉన్నాయి. ఈ సంవత్సరంలోనే ఢిల్లీ, జార్ఖండ్ ఎన్నికలు కూడా రాబోతున్నాయి.. రెండు దశాబ్దాల నుంచి ఎన్‌పిఎస్‌కు నిరసగా ఉద్యోగులు ఆందోళనలు చేస్తుండగా, పదేళ్లుగా కేంద్రంలో తామే అధికారం వెలగబెడుతూ, హఠాత్తుగా పెన్షన్ అంశం మోడీ ప్రభుత్వానికి గుర్తుకు వచ్చిందంటేనే దాని ఎత్తుగడ ఏమిటో తెలియని అమాయకలుఉ కాదు ప్రజలని గుర్తించాలి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పట్ల ఉద్యోగుల్లో వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో సీట్లు తగ్గాయి. అందుకే వారిని ఎలాగైనా మచ్చిక చేసుకునేందుకు పన్నిన పన్నాగంగా అర్థమైపోతుంది. ఇంత డ్రామాకూ ఒడిగట్టి మోడీ సర్కారు ఉద్యోగులకు కొత్తగా ఒరగబెట్టిందేమీ లేదు. ఎన్‌పిఎస్‌లో ఉద్యోగులు తప్పనిసరిగా తమ కంట్రిబ్యూషన్ చెల్లించాలి. చందా లేకుండా పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్) ఉద్యోగుల ప్రధాన డిమాండ్. ఆ మౌలిక అంశాన్ని అంటుకోలేదు మోడీ సంకీర్ణ ప్రభుత్వం. అందుకే యుపిఎస్ పట్ల ఉద్యోగుల నిరసనలు ఎగసిపడుతున్నాయి.

ఏకీకృత పెన్షన్ అంటున్నా ఎక్కడా ఏకీకృతం కనిపించదు. పాతిక సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే బేసిక్‌లో 50 శాతం పెన్షన్ వస్తుంది. మిగిలిన వారికి సర్వీస్ బట్టి పెన్షన్ ఖరారు చేస్తారు. పెన్షన్ పొందాలంటే ఉద్యోగికి కనీసం పదేళ్ల సర్వీస్ నిండి ఉండాలి. కనీస పెన్షన్ రూ.10 వేలే. బేసిక్‌లో యాభై శాతం పెన్షన్‌కు 20 ఏళ్ల సర్వీస్ ఉంటే సరిపోతుంది. కానీ 25 ఏళ్లు నిండాలన్నారు. ఈ నిబంధనలు ఉద్యోగులకు పెన్షన్ గ్యారంటీ ఇచ్చేవేమీ కాదు. ఇదేనా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కల్పించే ఆర్థిక భద్రత అన్నది ఆలోచన చేయాలి. ఎన్‌పిఎస్‌లో ఉన్న 23 లక్షల మంది యుపిఎస్‌లోకి మారితే గొప్ప ప్రయోజనం అంటోంది మోడీ సర్కారు. రాష్ట్రాలు కలిస్తే 90 లక్షల మందికి మేలు జరుగుతోందంటోంది. ఇదంతా తాము తీసుకొచ్చే యుపిఎస్ స్కీంకు ప్రమోషన్ వర్క్. ఉద్యోగులను మభ్యపెట్టే ఎత్తుగడగా గుర్తించాలి. ఇలాంటి ప్రయోగాలు చేసే బదులు గతంలో ఉన్న పెన్షన్ పునరుద్ధరించడం ద్వారా ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలి. ఇందుకోసం రాజకీయ నాయకులకు ఇచ్చే పెన్షన్ ఎత్తేసినా ఫర్వాలేదు.

# ఆయిల్‌పామ్‌కు అనుకూల వాతావరణం

## సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహం

## రైతుల్లో క్రమంగా పెరుగుతోన్న ఆసక్తి

**హైదరాబాద్, సెప్టెంబర్1 (క్విక్ టుడే న్యూస్):** రాష్ట్రంలో ఆయిల్ పాం సాగుకు అనుకూల వాతావరణం ఉందని, దీంతో జిల్లాలో రైతులను పెద్ద ఎత్తున ప్రోత్స హిస్తున్నారు. పంట పెట్టుబడులను తగ్గించే ప్రయత్నంలో భాగంగా అనేక జిల్లాల్లో ఆయిల్ పామ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగిస్తోంది. ప్రత్యేకించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పదేపదే ఇదే విషయం చెప్పి వారిని ఆయిల్ పామ్ సాగువైపు మళ్లేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందు కొచ్చారు. దీనికి సంబంధించి హార్టికల్చర్ శాఖ ఒక నివేదిక రూపొందించింది. ఖమ్మం, సిద్దిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటికే సాగు చేపట్టారు. వాతారణంతో పాటు,నీటి లభ్యత కూడా ఎక్కువగా ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం,వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పంట సాగు చేసేందుకు అనుకూలంగా ఉంది. నూనె గింజల ఉత్పత్తికి ఉష్ణోగ్రతలు,సాగుకు అనుగుణంగా దిగుబడి ఇచ్చే నేలలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఫలితంగా రైతాంగం ఆయిల్ పాం సాగుకు ఆసక్తి చూపుతు న్నారు. ఎకరా వరి సాగయ్యే నీటితో మూడెకరాల పామాయిల్ పంట సాగవుతుందని, అంతర పంటలతో అధిక లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆయిల్ పాం సాగుపై మొదటి నుంచీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు వర్షాలు కురిసి నీరు సమృద్ధిగా ఉంటే వరి పండిస్తున్నారు. ఆయిల్ పాం ప్రత్నామ్నాయ పంట కానుంది. రాబోయే రెండేండ్లలో తెలంగాణ వ్యాప్తంగా 42,250 ఎకరాల్లో



సాగుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుంది. ఇప్పటికే 2,500 ఎకరాల్లో తెలంగాణ ఉద్యానవన శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మొత్తం 246 మండలాలు అనుకూలంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఈ సాగు వల్ల రైతులను పంట మార్పిడి వైపు ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అందుకే దీనివైపు రైతులు మొగ్గ చూపేలా చేస్తోంది. ఖమ్మం,నిజామబాద్ లాంటి జిల్లాలు ప్రయోగాలకు ప్రసిద్దం. ఇప్పటికైతే ఇక్కడ అడుగు పడలేదు. అయితే ఏదైనా పంటప్రయోగం జరగగాలంటే ఇక్కడి రైతులు ముందుకు వస్తారు. వ్యవసాయశాఖ ఈ మేరకు ఆయా జిల్లాల్లో అనుకూలంగా ఉన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ప్రోత్సాహం అందించడంతో పాటు సబ్సిడీ కూడా అందుతున్న కారణంగా ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొక్కదశ నుంచి మార్కెటింగ్ వరకు అన్ని రకాలుగా సాయం చేయనుంది. రైతులకు మొక్కను రూ.25లకే అందిస్తారు. మొక్కలను కూడా ఉపాధిహామీ పథకం కింద అధికారులు నాటించనున్నారు. మొక్కలను పెంచడానికి ఈ ప్రాంతంలోనే అధికారులు నర్సరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. సబ్సిడీపై వారికి డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు జైపూర్ వద్ద ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం తిప్పలు కూడా తప్పనున్నాయి. ఇక సాగు విషయానికి వస్తే ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని, నామమాత్రపు ఎరువులు వాడితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

# కొనసాగుతున్న హైడ్రా దూకుడు

## ఫిర్యాదుల ఆధారంగా వివరాల సేకరణ

## ఆక్రమణలు గుర్తించి నోటీసులు

## అవసరమైతే వెంటనే కూల్చివేతలు

**హైదరాబాద్, సెప్టెంబర్1 (క్విక్ టుడే న్యూస్):** హైడ్రా దూకుడు కొనసాగుతోంది. ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. ఎక్కడిక్కడ అధికారుల నుంచి సమాచారం తెప్పించుకుంటున్నారు. ఫిర్యాదులపైనా విచారణ చేస్తున్నారు. పూర్తిస్థాయి సమాచారంతో రంగంలోకి దిగుతున్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ముందుకు సాగుతున్నారు. రామ్‌నగర్‌లో కాల్వ ఆక్రమణలను కూల్చేశారు. జాన్వాడపై పూర్తిస్తాయి నివేదిక కోసం ఎదురు చూస్తున్నారు. హిమాయత్ సాగర్‌లో ఆక్రమణలపైనా నివేదిక తెప్పించుకున్నారు. దుర్గం చెరువులో ఆక్రమణలపై కొరడా ఝుళిపించారు. ఇందులో ఉన్నవారికి నోటీసులు ఇచ్చారు. ఇలా ఎక్కడి నుంచి ఫిర్యాదులు వచ్చినా స్వీకరిస్తున్నారు. ప్రజలు కూడా ఆక్రమణలపై తమవద్ద ఉన్న సమాచారం చేరవేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 13 చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లలో నిర్మాణాలపై చర్యలు తీసుకుని, వాటిని తొలగించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు ఈ నెల మూడో తేదీ నుంచి నిర్మాణదారులు, సంస్థల ప్రతినిధులకు తాఖీదులు జారీ చేస్తున్నారు. వారం రోజుల నుంచి నెల రోజుల్లోపు నిర్మాణాలను ఖాళీ చేయని పక్షంలో తామే కూల్చేస్తామని వాటిలో పేర్కొంటున్నారు. శేరిలింగంపల్లి మండలంలోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అధికంగా నిర్మాణాలున్నట్టు అధికారులు గుర్తించారు. వీటిలో కొన్ని నిర్మాణాలు పలువురు సివిల్ సర్వీస్ అధికారుల పేరుపై ఉన్నాయి. ఐఆర్ఎస్ అధికారి చంద్రశేఖర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంతో పాటు మరికొందరు సినీ ప్రముఖుల నివాసాలు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి మాదాపూర్‌లోని అమర్ కో–ఆపరేటివ్ సొసైటీలో నివాసం ఉంది. వీటితో పాటు మాదాపూర్ పరిధిలోని అమర్ కో–ఆపరేటివ్ సొసైటీ, కావూరి హిల్స్, నెక్టార్ గా÷–డ్గ÷న్ కాలనీ, డాక్టర్స్ కాలనీలో పలు నిర్మాణాలకు తాఖీదులు జారీ చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్లలో ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు సంయుక్త సర్వేలు చేశారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధుల్లో చాలామంది బహుళ అంతస్తులు నిర్మించారని గుర్తించారు. కొందరు జీప్లస్3, మరికొందరు డూప్లెక్స్ ఇళ్లు నిర్మించారు. ఇంకొందరు మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలేశారు. దుర్గం చెరువుతో పాటు గంగారం చెరువు, పెద్ద చెరువు, నల్లగండ్ల చెరువు, ఉప్పల్‌లో నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధుల్లోనూ ఈ తరహా నిర్మాణాలే ఉన్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు.





# ముత్యాలమ్మ అమ్మవారు
# చెప్పింది చెప్పినట్లుగానే..

- యువగళం పాదయాత్రలో 2024లో అధికారంలోకి టిడిపినే అని నారా లోకేష్ కు చెప్పిన పూజారి గంగరాజు
- 2019 మాదిరిగానే 2023లో నిజమైన అమ్మవారి వాక్కు
- కొలిచిన భక్తులకు కొంగు బంగారు ముత్యాలమ్మ
- ఎలాంటి సమస్యలు అయినా తక్షణ పరిష్కారం చూపుతున్న ముత్యాలమ్మ

**గుంతకల్లు సెప్టెంబర్ 1 (క్విక్ టుడే న్యూస్) :** గుంతకల్లు పట్టణ పరిధిలోని జి కొట్టాల గ్రామంలోని ముత్యాలమ్మ పేటలో కొలువుదీరిన ముత్యాలమ్మ అమ్మవారు ప్రధాన పూజారి గంగరాజు చెప్పిన వాక్కు నూటి ముమ్మాటికి నిజమైంది. 2019 ఎన్నికల్లో వైసిపి గెలుస్తుందని ఆలయ ప్రధాన పూజారి గంగరాజు చెప్పింది చెప్పినట్టుగానే జరిగింది. అలాగే 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఏప్రిల్ 8 2023 గార్లదిన్నె వద్ద నారా లోకేష్ కు నాగలి అందజేసి ఈసారి అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం పార్టీ అని ఆయనకు చెప్పారు. అలాగే అక్కడ ఉన్నటువంటి తాడిపత్రి జేసీ ప్రభాకర్ రెడ్డికి అస్మిత్ రెడ్డి గెలుస్తారని అలాగే రాప్తాడు నుంచి పరిటాల సునీతమ్మ శాసనసభ్యులుగా గెలుస్తారని చెప్పారు. అమ్మవారు చెప్పినట్టుగానే టిడిపి అధికారంలోకి రావడం చాలా ఆశ్చర్యకరం.

**కొలిచిన భక్తులకు కొంగు బంగారం ముత్యాలమ్మ**

ప్రజల ఆరోగ్య, ఉద్యోగ ప్రదాయినిగా ముత్యాలమ్మవ్వ వారు విరాజిల్లుతున్నారు. వివిధ జబ్బులతో బాధపడుతున్న ప్రజలను డాక్టర్ల పరిష్కరించని సమస్యలను అమ్మవారు ఆరోగ్యాలను నయం చేశారని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే అమ్మవారి చల్లని ఆశీసులతో ఉద్యోగ రంగాల్లో ఎందరో స్థిరపడ్డారు. ఎందరో భక్తుల ఆరోగ్యాన్ని బాగు చేసిన అమ్మవారు ప్రజల ఆరాధ్య దైవంగా పిలవబడుతున్నారు. నమ్మిన వారికి అమ్మవారు అండగా నిలుస్తున్నారు. భక్తుల ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నారు. ఇక్కడ అది, మంగళ, శుక్రవారం భక్తులు అమ్మవారికి ఆలయ ప్రధాన పూజారి గంగరాజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు . ఆలయ ప్రధానపూజారి ముత్యాల గంగరాజు స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి మంగళ హారతి, నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. కొలిచే వారికి కొంగు బంగారంగా వరాలిచ్చే అమ్మవారిగా ముత్యాలమ్మవ్వ వారు పేరుగాంచారు. భక్తుల ఆరాధ్య దైవంగానూ ఇంటికి ఇలవేల్పుగానూ అమ్మవారు పిలువబడుతున్నారు. భక్తులు మనస్సులో కోరిక కోరుకుని అమ్మవారి ఆలయం వద్దకు వచ్చిపూజల్లో పాల్గొని వెళ్లినా తమ కోరికలు నెరవేరుతున్నాయని భక్తులు పేర్కొన్నారు. ఎందరోరాజకీయ ప్రముఖులు, ఉద్యోగ సమస్యలు ఉన్న వారు అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొంటున్నారు. వారి సమస్యలను పరిష్కరించు కుంటున్నారు ఆది, మంగళ, శుక్ర వారాల్లో ముత్యాలమ్మవ్వ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు. అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారు..






**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com